సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 339
గురువారం 29-2-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'


ప్రపంచ స్థాయి షాపింగ్
అనుభూతి సరికొత్తగా ఇప్పుడు
మన హయత్‌నగర్ లో
అద్భుతమైన ప్రారంభోత్సవ ఆఫర్లు
THE ONE STOP SHOP
1+1 OFFERS
COMBO OFFERS
ఇంకా మరెన్నో
CMR
SHOPPING MALL
The joy of life
భాగ్యలత కమాన్ ప్రక్కన,
హయత్‌నగర్
FOLLOW US ON /cmrshoppingmallindia /cmrshoppingmall
శారీస్
2 బనారసి శారీస్ ₹333
1 బ్రొకెడ్ శారీస్ ₹444
2 మల్ మల్ కాటన్ ₹499
2 కంచి కాటన్ ₹499
1 జిల్ శారీ ₹499
1 ఆర్ట్ బ్రొకెడ్ శారీస్ ₹555
2 బాంబే కాటన్ శారీస్ ₹555
3 బారా షిఫాన్ శారీస్ ₹599
2 మౌ ఫ్యాన్సీ శారీస్ ₹666
2 కాటన్ శారీస్ ₹666
3 లల్లీ షిఫాన్ శారీస్ ₹777
2 సరళ ఫ్యాన్సీ శారీస్ ₹777
4 సుచిత్ర కాటన్ ₹799
2 కేరళ కాటన్ శారీస్ ₹799
3 జార్జెట్ శారీస్ ₹849
2 అరవు కొట్టి శారీస్ ₹899
4 మోహిని శారీస్ ₹999
4 ఆస్తా శారీస్ ₹999
2 కుబేర పట్టు చీర ₹2950
2 ఉప్పాడ పట్టు చీర ₹2999
2 చంద్రిక పట్టు చీర ₹3600
2 వైదేహి పట్టు చీర ₹4000
2 మహాదేవ పట్టు చీర ₹5000
2 అక్షయ పట్టు చీర ₹5500
కిడ్స్ వేర్
2 గర్ల్స్ టీ షర్ట్స్ ₹299
2 గర్ల్స్ కాటన్ ఫ్రాక్స్ ₹499
2 బాయ్స్ టీ-షర్ట్స్ ₹449
2 బాయ్స్ షర్ట్స్ ₹449
2 బాబా సూట్స్ ₹499
2 గర్ల్స్ పలాజో సెట్ ₹999
2 గర్ల్స్ వాసరి ఫ్రాక్స్ ₹549
2 బాయ్స్ నైట్ సూట్స్ ₹549
2 గర్ల్స్ నైట్ సూట్స్ ₹599
2 బాయ్స్ జీన్స్ ₹699
2 బాయ్స్ కాటన్ ప్యాంట్స్ ₹799
*CONDITIONS APPLY
మెన్స్ వేర్
1 మెన్స్ టీ-షర్ట్స్ ONLY ₹149
3 మెన్స్ టీ-షర్ట్స్ ₹599
3 వైట్ వాష్ షర్ట్స్ ₹899
3 క్యాజువల్ షర్ట్స్ ₹899
3 మెన్స్ ఫార్మల్ ట్రౌజర్స్ ₹999
5 మెన్స్ ఫార్మల్ షర్ట్స్ ₹999
3 మెన్స్ కాటన్ ట్రౌజర్స్ ₹1199
2 మెన్స్ జీన్స్ ₹1499
ఉమెన్స్ వేర్
2 లేడీస్ నైటీస్ ₹199
2 లేడీస్ కుర్తీ ₹199
3 లేడీస్ చున్నీస్ ₹299
2 లేడీస్ కుర్తా ₹499
3 పలాజో ₹399
2 లేడీస్ వెస్టన్ డ్రెసెస్ ₹799
2 కాటన్ డ్రెస్ మెటీరియల్ ₹888
2 లేడీస్ కుర్తా ₹899
2 ఫ్రుయిట్‌కట్ చుడీదార్ ₹666
2 రెడీమేడ్ చుడీదార్స్ ₹1999
3 లేడీస్ ఫ్రాక్ కుర్తా ₹777
3 డ్రెస్ మెటీరియల్ కాంబో ప్యాక్ ₹999
2 పటియాల చుడీదార్స్ ₹1599
2 నారాయణపేట గాగ్రా ₹1999
కాస్మెటిక్స్ 10% OFF
ఫుట్‌వేర్ 10% OFF
పిల్లోస్ 1+1 ₹199
బి మిల్స్ సింగిల్ బెడ్ షీట్ BUY 2 ₹299
బి మిల్స్ బెడ్ షీట్స్ డబల్ BUY 2 ₹666
• చీరలు • చుడీదార్స్ • గాగ్రాస్ • ఉమెన్స్ వేర్ • మెన్స్‌వేర్ • కిడ్స్ రెడీమేడ్స్ • కాస్మెటిక్స్ • ఫుట్ వేర్
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ




గుచ్చేస్తున్న 'గుండుసూది'

రైతులు సాగుచేస్తున్న టమాటా పంటలను ఆశిస్తున్న గుండుసూది పురుగు తీవ్ర నష్టం కలిగిస్తోంది. 8లో▸



గ్యారంటీల అమలు బాగుంది

కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీల అమలు తీరు బాగుందని వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. 8లో▸



ఉత్సాహంగా దర్గా సందల్

పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా సందల్ ఊరేగింపు బుధవారం ఉదయం ఉత్సాహంగా కొనసాగింది. 8లో▸

ముగిసిన 'సహకార' బల పరీక్ష

- తొమ్మిది మంది సభ్యుల హాజరు
- కోర్టు కేసుతో ఫలితాలు గోప్యం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డిపై తొమ్మిది మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ నేపథ్యంలో జిల్లా సహకార శాఖ అధికారిణి ధాత్రిదేవి బుధవారం సంఘం కార్యాలయంలో బలపరీక్ష నిర్వహించారు. అవిశ్వాసం పెట్టిన సభ్యులతో సమావేశాన్ని నిర్వహించి వారి వివరాలను నమోదు చేసుకున్నారు. మొత్తం 13 మంది సభ్యులకు గాను ఒక సభ్యుడు అనారోగ్యంతో మరణించారు. మిగిలిన 12 మందిలో తొమ్మిది మంది సభ్యులు అవిశ్వాసం ఇచ్చిన విషయం విదితమే. అయితే బలపరీక్షకు రెండు రోజుల ముందే కోర్టులో కేసు వేశారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన అవిశ్వాస బలపరీక్షకు సంబంధించిన వివరాలను సహకార శాఖ అధికారులు మార్చి 7 వరకు రహస్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. బలపరీక్ష నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ సైదయ్య భారీగా పోలీసు బలగాలను మోహరించారు. అవిశ్వాస బలపరీక్షకు వైస్ చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్లు చేగూరి భరత్, మొగుళ్ల యాదిరెడ్డి, కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, చింతల లక్ష్మమ్మ, మేకల రాములు, బిజిలి బాలనర్సింహ, ఇటుకల మహేందర్‌రెడ్డి, గంటా శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు.



అవిశ్వాస బలపరీక్షకు హాజరైన డైరెక్టర్లు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ జూనియర్ కళాశాలవద్ద పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు షురూ..

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం తొలిపరీక్ష కావడంతో ఆయా కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల హడావుడి కనిపించింది. విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అరగంట ముందుగానే అనుమతించారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో తొమ్మిది గంటలకు గేట్లు మూసివేశారు. దీంతో ఆలస్యంగా వచ్చిన వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. సెంటర్లను ఇంటర్మీడియట్, రెవెన్యూ అధికారులతో పాటుగా స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.



షాద్‌నగర్: జూనియర్ కళాశాల కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



షాద్‌నగర్: కేంద్రంలోని వెళ్లే విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

న్యూస్‌రీల్

కన్న కొడుకును కడతేర్చిన తండ్రి

మద్యం తాగి పరువు తీస్తున్నాడని ఆక్రోశం




వినయ్ (ఫైల్)

మన్సూరాబాద్/హయత్‌నగర్: మద్యం తాగి కుటుంబ పరువు తీస్తున్నాడని కలత చెందాడో..ఆస్తి తగాదాలు ఉన్నాయో తెలియలేదు కానీ..ఓ తండ్రి కన్న కొడుకును కడతేర్చాడు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన కలగోని శ్రీనివాస్‌గౌడ్ గత కొంత కాలంగా మునగనూరులోని రామాంజనేయకాలనీ రోడ్ నెంబర్–7 స్వంత ఇంటిలో నివాసం ఉంటూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వినయ్ (28) ఐదు సంవత్సరాల క్రితం ప్రవల్లికను ప్రేమించి పెళ్లి చేసుకుని సమీపంలోని ఓ ఇంట్లో భార్యతో కలిసి నివాసముంటున్నాడు. వీరికి రెండేళ్ల పాప రక్షిత ఉంది. ఇటీవల కొద్ది కాలంగా వినయ్ తరచుగా మద్యం తాగి తండ్రి శ్రీనివాస్‌గౌడ్ నివాసానికి వచ్చి వ్యాపారం చేసుకుంటా డబ్బులు ఇవ్వాలని గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి గొడవ పడ్డాడు. వ్యాపారం చేసుకుంటా..ఆస్తిలో తన భాగం ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. అలాగే మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని అడిగాడు. చేసేది లేక శ్రీనివాస్‌గౌడ్ రూ.500 మద్యానికి ఇచ్చాడు. అనంతరం వినయ్ మద్యం తెచ్చుకుని తాగి మరింతగా ఇంట్లో గొడవకు దిగాడు. దీంతో ఆవేశానికి లోనైన శ్రీనివాస్‌గౌడ్ అక్కడే ఉన్న ఇనుప పారతో వినయ్ తలపై గట్టిగా బాదాడు. దీంతో తలకు తీవ్ర గాయమై వినయ్ కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ఈ ఘటనకు ఆస్తి తగాదాలే కారణమని కూడా తెలుస్తోంది. హయత్‌నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. శ్రీనివాస్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అన్యాక్రాంతం!

- ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, వక్ఫ్, దేవాదాయ, అటవీ భూములు భారీగా ఆక్రమణ
- రికార్డుల్లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా..
- ఒక్కొక్కటిగా బయటికి వస్తున్న భూ కబ్జాలు
- మండలాల వారీగా ఆరా తీస్తున్న అధికారులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో రెవెన్యూ అధికారులు విఫలమవుతున్నారు. కళ్లముందే విలువైన భూములు కరిగిపోతున్నా కళ్లప్పగించి చూస్తున్నారు. వాటిని అడ్డుకోకపోగా.. పరోక్షంగా అక్రమార్కులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి,, ప్రభుత్వ భూములకు హద్దులను నిర్ణయించి, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో పోస్టింగ్‌ల కోసం ప్రభుత్వంలోని పెద్దలను ఆశ్రయిస్తున్నారు. వారి సిఫార్సుల మేరకు పోస్టింగ్ పొందిన తర్వాత వారితో అంటకాగుతున్నారు. తర్వాత వారి భూ కబ్జాలకు పరోక్షంగా సహకరిస్తున్నారు. ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూముల విస్తీర్ణానికి.. క్షేత్ర స్థాయిలో ఉన్న భూ విస్తీర్ణానికి పొంతనే ఉండడం లేదు. అధికారులే స్వయంగా అసలు సర్వే నంబర్లకు బై నంబర్లు వేసి.. విలువైన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. ఇందుకు ప్రతిఫలంగా భారీ మొత్తంలో నగదు, వస్తువులు, ఖాళీ స్థలాలు, వ్యవసాయ భూములు, ప్లాట్లు, విల్లాలు బహుమతిగా పొందారని తెలుస్తోంది. పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చి, వాటికి సరిహద్దు సమస్యలు సృష్టించి అనేక వివాదాలకు కారణమవుతున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని విలువైన భూములపై దృష్టి సారించింది. మండలాల వారీగా ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, వక్ఫ్, దేవాదాయ, ఇతర భూముల వివరాలను పక్కాగా సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు కలెక్టర్ ఆయా మండలాల తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

కబ్జాదారుల చేతుల్లోకి..

జిల్లాలో 2,18,536.02 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, మరో 90,911 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. దీనిలో 52,315 మంది పేద రైతులకు అప్పటి ప్రభుత్వం 75,450.29 ఎకరాలు అసైన్డ్ చేసింది. ప్రజావసరాల కోసం మరో 65,935.35 ఎకరాలు కేటాయించింది. ఆక్రమణదారుల వద్ద 25,597.01 ఎకరాలు ఉండగా, అసైన్డ్ చేసిన తర్వాత 9,885.13 ఎకరాలు చేతులు మారినట్లు గుర్తించారు. 42,278 అసైన్డ్ ఉల్లంఘన కేసులు కూడా నమోదయ్యాయి. దర్గాలు, మసీదులు, ఆషూర్‌ఖానాలు, చిల్లాలు, శ్మశానవాటికల పేరుతో 14,785.17 ఎకరాల వక్ఫ్ భూమి ఉండగా, వీటిలో 13,480.25 ఎకరాలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. మణికొండ దర్గాకు 154 ఎకరాలు ఉన్నట్లు రికార్డులు చూపుతుండగా, క్షేత్రస్థాయిలో గజం భూమి కూడా లేదు. మహేశ్వరం మండలం కొంగరకుర్దు ఎ లోని సర్వే నంబర్ 2 నుంచి 400 వరకు దర్గా సయ్యద్ ఖత్తార్ హుస్సేనీ పేరిట ఉన్న 500 ఎకరాలకు పైగా ఉన్న వక్ఫ్ భూముల్లోనూ వెంచర్లు వెలుస్తున్నాయి. జిల్లాలో 21,931.03 ఎకరాల భూదాన్ భూములు ఉండగా, 9,678 మంది పేదలకు దానం చేశారు. వీటిలో మెజార్టీ భూములు ఇప్పటికే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. మహేశ్వరం మండలం నాగారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు, బాటసింగారం, యాచారం మండలం కురిమిద్ద, కందుకూరు మండలాల్లోని విలువైన భూదాన్ భూములు ఇప్పటికే పట్టా భూములుగా మారినట్లు సమాచారం. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డుల్లో ఈ భూములన్నీ నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ.. వీటిలో మెజార్టీ భూములు పట్టా భూములుగా ఎలా మారాయనే ప్రశ్నకు రెవెన్యూ అధికారుల వద్ద సమాధానం లేదు.

మచ్చుకు కొన్ని..

- మహేశ్వరం, తుమ్మలూరు రెవెన్యూ గ్రామాల మధ్య 70 ఎకరాల ప్రభుత్వ భూమిని.. పట్టా భూమిగా మార్చి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు.
- శంషాబాద్ మండలం మదనపల్లి రెవెన్యూ కొత్తతండా సర్వే నంబర్ 50లో 559 ఎకరాల ప్రభుత్వ భూమిలో మెజార్టీ భాగం ఇప్పటికే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది.
- కొత్తూరు మండలం పెంజర్ల సర్వే నంబర్ 255లోని ప్రభుత్వ అసైన్డ్ భూమి ప్రైవేటు వ్యక్తుల పేరున రిజిస్ట్రేషన్లు చేశారు.
- శంకర్‌పల్లి మండలం కొండకల్ సర్వే నంబర్ 555లోని 117.16 ఎకరాల బిలాదాఖ్లా భూమిలోని ఇప్పటికే 26 ఎకరాలు రియల్టర్ల పేరున రాసిచ్చేశారు.
- శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేటలోని సర్వే నంబర్ 63లో 42 ఎకరాలు..సెత్వార్ భూమిని పట్టా భూమిగా మార్చేశారు.
- గోపన్‌పల్లి సర్వే నంబర్ 124లోని 50 ఎకరాలు మాయం చేశారు.
- శంషాబాద్ సర్వే నంబర్ 626/1లోని 360.11 ఎకరాలు హెచ్ఎండీఏకు కేటాయించగా, దీనిలో 28 ఎకరాలు రియల్టర్ల చేతుల్లోకి వెళ్లింది. మంకాల్ పరిధిలోని 25.32 ఎకరాలు రియల్టర్లకు రాసిచ్చేశారు.
- గండిపేట మండలం ఖానాపూర్‌లోని 150 ఎకరాల బిలాదాఖ్లా భూములకు సర్వే నంబర్లు సృష్టించి, ప్రైవేటు రిసార్ట్స్‌కు రాసిచ్చేశారు.
- మియాపూర్ సర్వే నంబర్ 69లోని 27 ఎకరాలు, గచ్చిబౌలి సర్వే నంబర్ 38 నుంచి 54 వరకు ఉన్న 76 ఎకరాల అర్బన్‌సీలింగ్ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టారు.
- శేరిలింగంపల్లి సర్వే నంబర్ 90 నుంచి 102 వరకు ఉన్న 110 ఎకరాలు, మాదాపూర్ సర్వే నంబర్ 64,68లోని 5 ఎకరాలు, హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 80, కొండాపూర్ సర్వే నంబర్ 87,88లోని పది ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు.

రెవెన్యూ రికార్డుల్లో లెక్క ఇలా..

జిల్లాలో మొత్తం భూమి:	13,19,303 ఎకరాలు
ప్రభుత్వ భూమి:	2,18,536.02 ఎకరాలు
అసైన్డ్‌భూమి:	90,911 ఎకరాలు
అటవీ భూమి:	29,545.90 హెక్టార్లు
పోడు భూమి:	670.06 ఎకరాలు
చెరువులు:	68,904 ఎకరాలు
వక్ఫ్ భూమి:	14,785.17 ఎకరాలు
భూదాన్ భూమి:	21,931.03 ఎకరాలు



నాలుగేళ్లక్రితం పుట్టినరోజు వేడుకలలో సంజన (ఇన్‌సెట్‌లో సంజన)

❖ 16 ఏళ్లు.. 4వ బర్త్‌డే

మున్సిపల్ కౌన్సిలర్ సుండూరి జాన్సీ, శేఖర్ దంపతుల కుమార్తె సంజన పుట్టినరోజు వేడుక నాలుగేళ్లకోసారి జరుపుకొంటుంది. 2008 ఫిబ్రవరి 29న జన్మించిన ఆమెకు ఈరోజున16 ఏళ్లు నిండుతుండగా.. 4వ బర్త్ డే చేసుకుంటోంది. లీపు సంవత్సరంలో పుట్టిన తమ బిడ్డ జన్మదిన వేడుకలను నాలుగేళ్లకు ఒకసారి ఘనంగా నిర్వహించడం మధురమైన అనుభూతినిస్తోందని శేఖర్ దంపతులు తెలిపారు.

నాలుగేళ్ల సంబరం!

సమ్‌థింగ్ స్పెషల్.. లీప్ సంవత్సరం

- కొందరికి ప్రత్యేకం ఫిబ్రవరి 29
- నాలుగేళ్లకోసారి పుట్టిన, పెళ్లి రోజు వేడుకలు

ఏడాదికి 365 రోజులుండగా.. లీప్ సంవత్సరంలో 366 ఉంటాయి. ఇది అందరికీ కామన్ అయినా.. కొందరికి వెరీ స్పెషల్. పుట్టిన రోజు, పెళ్లి రోజు సాధారణంగా అందరికీ ఏడాదిలో ఒకసారి వస్తే.. వీరికి నాలుగేళ్లకోసారి వస్తుంది. అందుకే ఫిబ్రవరి 29న జన్మించిన వారు.. వివాహం చేసుకున్న వారు ఆయా వేడుకలను ధూంధాంగా జరుపుకొంటారు. ఈ సుదినం కోసం ఎదురు చూస్తుంటారు.

– ఇబ్రహీంపట్నం రూరల్, ఆమనగల్లు

25 ఏళ్లలో ఐదో వార్షికోత్సవం



కందుకూరు మండలం జబ్బారిగూడ మా స్వగ్రామం. 20ఏళ్ల క్రితం ఫిబ్రవరి 29న లీప్ సంవత్సరం రో జున వివాహం జరిగింది.పెళ్లైన రెండు సంవత్సరాల తర్వాత ఇబ్రహీంపట్నంలో స్థిరపడ్డాం. మాది వ్యవసాయ కుటుంబం ఒక బిడ్డ ఉంది. 20 ఏళ్ల వైవాహిక జీవితంలో ఈ రోజు ఐదో పెళ్లి రోజు జరుపుకొంటున్నాం. మా వి వాహానికి ప్రత్యేకమైన రోజు లీపు సంవత్సరం.ఈ రోజు కోసం ఎదురుచూస్తూ ఉంటాం. చాలా సంతోషంగా పెద్ద ఎత్తున పెళ్లిరోజు వే డుకలు నిర్వహించడానికి ఏర్పాటు చేసుకున్నాం.

– మానన్నగారి స్వప్న, సుభాష్‌రెడ్డి

నేడే మా వివాహం



మా పెద్దలు నిశ్చయించిన ముహూర్తానికి నా పెళ్లి జరుగుతుంది. ఫిబ్రవరి 29న మంచి రోజు ఉందని వేదపండితులు చెప్పడంతో మఠం రవీందర్‌తో నా వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంబీఏ చదువుకున్నప్పటికీ పురోహిత నేపథ్యం ఉన్న మా కుటుంబ ఆచార వ్యవహారాలను కాపాడుకుంటున్నాం. వివాహం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పా ట్లు చేశారు.

– తరణిమఠం మేఘన, ఇబ్రహీంపట్నం

కారు నుంచి కమలానికి

- మహేశ్వరం ఎంపీపీ పీఠం చేజార్చుకున్న బీఆర్ఎస్
- సమాన ఓట్లు రావడంతో డ్రా తీసిన ఎన్నికల అధికారులు
- హైకోర్టు ఆదేశాల మేరకు సీల్డ్ కవర్‌లో కలెక్టర్‌కు ఫలితాలు



బీజేపీ శ్రేణుల విజయోత్సాహం

మహేశ్వరం: మహేశ్వరం నూతన ఎంపీపీగా నాగారం ఎంపీటీసీ సభ్యుడు కుండె వెంకటేశ్ ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. పోటీ చేసిన అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో అధికారులు డ్రా తీసి వెంకటేశ్‌ను ఎంపీపీగా ఎన్నికైనట్లు ప్రకటించారు. మండల పరిధిలో 13 మంది ఎంపీటీసీ సభ్యులుండగా ఎంపీపీ, ఘట్టుపల్లి ఎంపీటీసీ సభ్యుడు కొరుపోలు రఘుమారెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఎంపీపీ పదవికి ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 12 మంది ఎంపీటీసీ సభ్యులకు అధికారులు నోటీసులు ఇచ్చి ఎన్నిక నిర్వహించారు. మహేశ్వరం–3 ఎంపీటీసీ సభ్యురాలు, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్ ఎన్నికల ఫలితాలు ప్రకటించవద్దని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆదేశాలు వచ్చే వరకు ఫలితాలు సీల్డ్ కవర్‌లో భద్రపర్చాలని అధికారులకు సూచించారు.

క్రాస్ ఓటింగ్

మొత్తం 12 మంది ఎంపీటీసీ సభ్యులలో బీజేపీ నుంచి నాగారం ఎంపీటీసీ సభ్యుడు కుండె వెంకటేశ్, బీఆర్ఎస్ నుండి కోళ్లపడకల్ ఎంపీటీసీ సభ్యుడు హన్మగళ్ల చంద్రయ్య ఎంపీపీ పదవికి పోటీ పడ్డారు. పోతర్ల సుదర్శన్(మహేశ్వరం–1), వనంపల్లి అనురాధ(మహేశ్వరం–2),రాత్లవత్ సునీతానాయక్(మహేశ్వరం–3),అనితా నాయక్(మాణిక్యమ్మగూడ), మద్ది రామిరెడ్డి(తుమ్మలూరు), తొంట స్వప్న(కల్వకోల్), విజయ్ నాయక్(హర్షగూడ), పెంటల కుమారి(అమీర్‌పేట్), నడికూడ రమేశ్(గొల్లూరు), అన్‌రెడ్డి సువర్ణమ్మ అభ్యర్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి కుండె వెంకటేశ్‌ని మహేశ్వరం ఎంపీటీసీ–3 అభ్యర్థి సునీతా నాయక్ ప్రతిపాదించగా, బీఆర్ఎస్ ఎంపీపీ అభ్యర్థి హన్మగళ్ల చంద్రయ్యను దుబ్బచర్ల ఎంపీటీసీ అన్‌రెడ్డి సువర్ణమ్మ ప్రతిపాదించారు. మిగిలిన పదిమంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన మహేశ్వరం–3 ఎంపీటీసీ సభ్యురాలు, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి వెంకటేశ్‌కు మద్దతిచ్చారు. దీంతో ఇరువురు అభ్యర్థులకు సమాన ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల అధికారిణి సుభాషిణి డ్రా తీయగా కుండె వెంకటేశ్ పేరు వచ్చింది. ఎన్నికల అధికారులు ఫలితాలను సీల్డ్ కవర్‌లో కలెక్టర్‌కు పంపించారు. బీఆర్ఎస్ చేతిలో ఉన్న ఎంపీపీ పీఠం బీజేపీ ఖాతాలోకి రావడంతో ఆపార్టీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసి టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు.

ఏం జరిగిందో?

- కుమారుడి ఆత్మహత్య.. అనుమానాస్పద స్థితిలో తల్లి మృతి
- మౌలాలి ఈస్ట్ ప్రగతినగర్‌లో విషాదం



శ్రీధర్ గౌడ్ (ఫైల్)



విజయ (ఫైల్)

మల్కాజిగిరి: కుమారుడు ఆత్మహత్య చేసుకోవడం.. అదే గదిలో అతని తల్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెల్పిన వివరాల మేరకు..మౌలాలి ఈస్ట్ ప్రగతినగర్‌కు చెందిన మెరుగు విజయ (73) భర్త చనిపోవడంతో కుమారుడు శ్రీధర్ గౌడ్(47)తో కలిసి ఉంటుంది. శ్రీధర్ గౌడ్‌కు భార్య శైలజతో మనస్పర్థలు రావడంతో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఆమె వేరే ఇంట్లో ఉంటోంది. కాగా శ్రీధర్ గౌడ్ ప్రస్తుతం జవహర్‌నగర్‌లో ఉన్న వాటర్ ప్లాంట్ నిర్వహణ చూసుకుంటున్నాడు. వారి సంతానంలో కుమారుడు, కూతురు ఇతని వద్ద ఉంటుండగా..మరో కుమారుడితో కలిసి శైలజ కాప్రాలో ఉంటున్నది. బుధవారం ఉదయం శ్రీధర్ కుమార్తె నిద్రలేచి చూసేసరికి తండ్రి బెడ్‌రూమ్‌లో ఉరివేసుకొని ఉండగా, అదే రూములో ఆమె నానమ్మ విజయ కిందపడి చనిపోయిఉండడం గమనించింది. వెంటనే బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి.. పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ మల్లయ్యలు వారిద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శ్రీధర్ భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

కుటుంబ సమస్యలే కారణమా?

భిక్షపతి, విజయలకు నలుగురు సంతానం. ఇ ద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. ఆర్థికంగా బాగానే ఉన్న కుటుంబం. శ్రీధర్‌కు అతని భార్య శైలజకు విభేదాలు ఏర్పడ్డాయి. గతంలో మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో శ్రీధర్‌పై వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. విడాకుల కోసం కోర్టును ఆశ్రయించగా..వాదనలు పూర్తయి వచ్చే నెలలో తీర్పు రానున్నట్లు సమాచారం . పోలీసులు శ్రీధర్ ఇంట్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని ప రిశీలించగా..మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో శ్రీధర్ బయట నుంచి ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత పాలు పోసే వ్యక్తి రావడంతో విజయ పాలు పోయించుకున్నట్లు రికార్డు అయింది. విజయ నేల మీద పడి వుండడం, తల వెనుక రక్తం ఉండడాన్ని పోలీసులు గమనించారు. కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో షాక్‌కు గురైన ఆమె కింద పడిపోయి చనిపోయిందా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నా యా అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వచ్చే నెలలో విడాకులకు సంబంధించి తీర్పు రానున్నడంతో శ్రీధర్ ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడివుండవచ్చునని భావిస్తు న్నారు. గత కొంత కాలంగా ఆస్తి పంపకాలపై కూడా గొడవలు జరుగుతున్నట్లు సమాచారం.



సంఘటనా స్థలంలో మృతదేహాలు

అమ్మవారి మంగళసూత్రం చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: కనకదుర్గ అమ్మవారి గుడిలో నుంచి అమ్మవారి మంగళసూత్రాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లోని కనకదుర్గ అమ్మవారికి భక్తులు 2 తులాల బంగారు మంగళ సూత్రం వేశారు. ప్రతి రోజులాగే అమ్మవారికి పూజలు చేయడానికి పూజారి బుధవారం ఆలయం తెరిచి చూడగా.. అమ్మవారి మంగళ సూత్రం చోరీ అయినట్లు గుర్తించాడు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా ఈనెల 26న 4:20 నిమిషాలకు గుర్తుతెలియని వ్యక్తి గ్రిల్స్ తొలగించకుండా, తలుపులు పగులగొట్టకుండా.. కర్ర సహాయంతో మంగళసూత్రం ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మహారాష్ట్రకి చెందిన అంజన్‌బాయి(62) గత కొద్ది సంవత్సరాలుగా బతుకుదెరువుకోసం తుర్కయంజాల్‌కు వచ్చి ఇల్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటోంది. స్థానికంగా ఉన్న మస్కతీ డెయిరీలో పనిచేసేది. రోజూలాగే ఈనెల 26న పని కోసం కంపెనీకి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. కంపెనీ వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ఆదిబట్ల పోలీసులకు అంజన్‌బాయి కొడుకు ఆదిబట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమ

ఇబ్రహీంపట్నం రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, జిల్లా నాయకులు నర్సింహ, ఎల్లేశ్, బుగ్గరాములు, శేఖర్, బాల్‌రాజ్, చందునాయక్, శ్రీను, అలివేలు, సరిత, గణేష్, తులసిగారి నర్సింహ, పద్మ, లక్ష్మి, మల్లారి, నవనీత తదితరులు పాల్గొన్నారు.

టమాటాను గుచ్చేస్తున్న గుండుసూది!

- పంటను ఆశించి తీవ్ర నష్టం చేస్తున్న పురుగు
- వారం రోజుల్లోనే తుడిచిపెట్టుకుపోతున్న తోటలు
- సస్యరక్షణ చర్యలతోనే కట్టడి
- కృషి విజ్ఞాన కేంద్రం నిపుణుడు శ్రీకృష్ణ సలహాలు





పురుగు ఆశించి దెబ్బతిన్న టమాటా పంట

కందుకూరు: రైతులు సాగుచేస్తున్న టమాటా పంటలను ఆశిస్తున్న గుండుసూది పురుగు తీవ్ర నష్టం కలిగిస్తోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అధికంగా పండించే కూరగాయ పంట టమాటా. వర్షాకాలంలో 30- 40 వేల ఎకరాలు, యాసంగిలో 15 వేల ఎకరాలల్లో సాగవుతోంది. 2014 సంవత్సరం మార్చి, ఏప్రిల్ మాసాల్లో మొదటిసారిగా గుండు సూది(ట్యూటా అబ్సల్యూట) పురుగు టమాటాను ఆశించి నష్టపరిచింది. పంట ఆకులు, కాయలపై ఆశించి రంధ్రాలు చేసి తీవ్రంగా నష్టపర్చింది. అప్పటి నుంచి ఏటా ఫిబ్రవరి నుంచి మే నెలల మధ్య చాలా ప్రాంతాల్లో పురుగు విజృంభించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆ పురుగు పాము పొడ పురుగు లాగే ఉండటంతో దానికి సంబంధించిన క్రిమిసంహారక మందులనే పిచికారీ చేసి ఫలితం లేక పంటలు కోల్పోతున్నారని కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. ఆ పురుగు జీవిత కాలం చాలా తక్కువ(7 రోజులు). అందుకే దీని నివారణ కూడా కష్టమవుతుంది. ఆ పురుగు నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను గురించి ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

నష్టపరిచే భాగాలు..

ట్యూటా అబ్సల్యూట పురుగు సోలనేట్ కుటుంబానికి చెందిన టమాటా, వంగ, బంగాళదుంప, మిర్చి, క్యారెట్ వంటి పంటను అధికంగా ఆశించి నష్టపరుస్తుంది. ప్రస్తుతం టమాటాపై అధికంగా కనిపిస్తుంది. ఈ పురుగు లార్వా దశ మాత్రమే మొక్కపై ఆకులు, కాయల భాగాలను పాడు చేసస్తుంది. ఈ లార్వాలు పంట కాలం అన్ని దశల్లో ఆశిస్తాయి. నేలపై ఉండే మొక్క భాగాలపైన, లేత ఆకులు కాండాలు, మొగ్గలు, పచ్చికాయలపై రంధ్రాలు చేసి ఆశించడంతో కాయ కుళ్లి వాసన వస్తుంది. లార్వాలు ఆకులపై చేరి లోపలి భాగాలు తింటూ ఆకులు, కణాలు తెల్లబారి పోతాయి. చివరకు ఆకులు మొత్తం ఎండిపోతాయి. ఈ పురుగుతో తక్కువ సమయంలో ఎక్కువ పునరుత్పత్తి జరిగి అధిక సంఖ్యలో ఉండటంతో నష్టం భారీగా సంభవిస్తుంది. పురుగు లక్షణాలు గమనించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి.

నివారణ చర్యలు..

ఈ పురుగు లార్వాలు ఆకుల లోపల ఉండటంతో రసాయన మందులతో నివారించడం చాలా కష్టం. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడంతో మంచి ఫలితాలు ఉంటాయి.

- వేసవిలో లోతు దుక్కులు చేయటం.
- పంట చుట్టుపక్కల ఎత్తుగా పెరిగే జొన్న, మొక్కజొన్న, సజ్జ వంటి పంటను 2- 3 వరుసల్లో వేసుకుంటే పురుగు వ్యాప్తి కొంత తగ్గుతుంది.
- ఎక్కువగా పురుగు ఆశించిన మొక్కలను వెంటనే తీసి వేసి పొలానికి దూరంగా కాల్చి వేయాలి.
- పొలం వెంబడి, గట్ల వెంబడి ఉమ్మెత్త మొక్కలు లేకుండా చేయాలి. లేకపోతే ఆ మొక్కలు పురుగులకు ఆతిథ్యం ఇస్తాయి.
- వీలైతే ప్లాస్టిక్ మల్చింగ్ పద్ధతిలో సాగు ద్వారా పంటను ఈ పురుగు నుంచి కొంత వరకు కాపాడవచ్చు.



టమాటా కాయపై రంధ్రాలు వేసిన పురుగు

జీవ నియంత్రణ పద్ధతులు..

- జీవ నియంత్రణ పద్ధతులైన బాసిల్లస్ తురింజినీస్స్(బిటి) 1 గ్రా. లేదా 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా బెవెరియా బాసియాన(1 గ్రా. లీటర్ నీటికి) సాయంత్రం వేళల్లో పిచికారీ చేసి నివారించవచ్చు.

లింగాకర్షక బుట్టలు..

- మగ రెక్కల పురుగులను ఆకర్షించగలిగే లింగాకర్షక బుట్టలను(ఎరలు) భూమిలో ఒక అడుగు ఎత్తులో ఒక కట్టెకు అమర్చాలి. ఎక్కువ సంఖ్యలో ఎరలను అమర్చి మగ పురుగులను నియంత్రించడంతో పంట నష్టం తగ్గించవచ్చు.

పసుపు జిగురు పేపర్..

పొలంలో అక్కడక్కడా పసుపు జిగురు పేపర్‌ను ఉంచడం ద్వారా రెక్కల పురుగును నియంత్రించవచ్చు.

రసాయన పద్ధతులు..

ఈ పురుగుకు రసాయనాలకు త్వరగా తట్టుకునే శక్తి ఉంటుంది. ఎక్కువ సార్లు ఒకే రసాయనం వాడకుండా కింది వాటిని మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి. అవసరం మేరకు రసాయనాలు వాడాలి. సైపనోసాద్ 0.4 మి.లీ, లేదా ఇండాక్సికార్బ్ 1 మి.లీ. లేదా డెల్టామెత్రిన్ 0.5 మి.లీ, లేదా కొరాజిన్ 0.5 మి.లీ మరియు వేపనూనె(1,500 పీపీఎం) 5 మి.లీ లీటరు నీటికి కలిపి పంటపై సాయంత్రం వేళల్లో పిచికారీ చేస్తే పురుగును సమర్థవంతంగా అరికట్టవచ్చును.

కడుపునొప్పి భరించలేక..

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లోని వేదపురికాలనీకి చెందిన మద్ది శ్రీనివాస్‌రెడ్డి కొన్నిరోజులుగా కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 26న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.60 లక్షల గంజాయి స్వాధీనం

నిందితుడి అరెస్ట్

నందిగామ: బతుకుదెరువు కోసం ఒడిశా రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఓ వ్యక్తి కూలి పనులు చేసుకుంటూనే మరో వైపు గుట్టు చప్పుడు కాకుండా గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం మేరకు.. ఒడిశా రాష్ట్రం కందమయ్ జిల్లా, సారంగడ మండలం పీపలసాయి గ్రామానికి చెందిన మానస్ రంజన్ కొన్ని నెలల క్రితం బతుకుదెరువు కోసం కొత్తూరు మండలం తిమ్మాపూర్‌కు వచ్చాడు. స్థానిక పరిశ్రమలో కూలిపని చేసుంటూ జీవించేవాడు. ఈ క్రమంలో అక్రమ సంపాదన కోసం రంజన్ గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాడు. స్థానిక పరిశ్రమల్లో పనిచేసే కార్మికులను టార్గెట్ చేసుకొని ఒడిశా రాష్ట్రం సిరంగియార్ గ్రామానికి చెందిన వీరుపాక్ష్ నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని కొనుగోలు చేసి దాన్ని చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి కార్మికులకు విక్రయిస్తూ ఉండేవాడు. పక్కా సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ గోపాలకృష్ణ మంగళవారం మధ్యాహ్నం మండలంలోని అయ్యప్ప స్వామి ఆలయ బస్టాప్ వద్ద శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులతో మాటు వేసి మానస్ రంజన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.1.60లక్షల విలువ చేసే 6 ప్యాకెట్ల గంజాయి, ఒక సెల్‌ఫోన్, రూ.490 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

గ్యారంటీల అమలు తీరు బాగుంది



సునీతారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

- బీఆర్‌ఎస్‌ను వీడిన మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి
- జెడ్పీ చైర్‌పర్సన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

మొయినాబాద్ రూరల్: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేవరంపల్లి మహేందర్‌రెడ్డి తన పదవికి, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీంభరత్‌ను కలిసిన మహేందర్‌రెడ్డి వారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తదనంతరం అజీజ్‌నగర్‌లో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలు తీరును చూసి ఆ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే నాలుగు గ్యారెంటీలను అమలు చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. మాజీ సర్పంచ్ మనోజ్‌కుమార్, ఈగ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జిల్లా మత్స్య కార్మిక నాయకుడు బాలరాజ్ తదితరులు ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, జైపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

జిల్లా ఉప వైద్యాధికారి వినోద్‌కుమార్

మీర్‌పేట: మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి డా.వినోద్‌కుమార్ అన్నారు. మీర్‌పేటలోని బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డా.బాలమణి ఆధ్వర్యంలో బుధవారం మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీల అధికారులు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బందికి పల్స్ పోలియో టీకాల పంపిణీపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. బాలాపూర్ వైద్యాధికారిణి బాలమణి మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండల పరిధిలో మొత్తం 68 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనున్నామని తెలిపారు. ఆరోజు వేయించని పిల్లల కోసం 4, 5 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు.

ఉత్సాహంగా పహాడీషరీఫ్ దర్గా సందల్



వేడుకలో పాల్గొన్న ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు



ఒంటెలపై సందల్ ఊరేగింపు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా సందల్ ఊరేగింపు బుధవారం ఉదయం ఉత్సాహంగా కొనసాగింది. ఉత్సవాల్లో భాగంగా బాలాపూర్‌లో బాబా అడుగిడిన నివాసం నుంచి మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనల అనంతరం సందల్ ఊరేగింపు ప్రారంభమయ్యింది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించిన అనంతరం కొత్తపేట, వెంకటాపూర్, షాహీన్‌నగర్, జల్‌పల్లి కమాన్‌ల మీదుగా బుధవారం ఉదయం 8గంటలకు పహాడీషరీఫ్ దర్గాకు చేరుకుంది. అనంతరం గంధంను కొండపై ఉన్న షర్ఫుద్దీన్ బాబా సమాధిపై ఉంచి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి బాబా సమాధిపై చాదర్ సమర్పించారు. మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, ఏసీపీ ఉమామహేశ్వర్ రావు, పహాడీషరీఫ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్లు గురువా రెడ్డి, భూపతి బందోబస్తును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కొండల్ యాదవ్, దస్తగిర్, అబ్దుల్లా బిన్ అవద్, శ్రీధర్, షేక్ అఫ్జల్, యూసుఫ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా అవమానించారు

- బీఆర్ఎస్ నేతలపై మహేశ్వరం ఇన్‌చార్జి ఎంపీపీ సునీత ఫైర్
- ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన
- త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరుతానని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న సునీతా అంధ్యానాయక్ దంపతులు

మహేశ్వరం: మహేశ్వరం ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా అంధ్యానాయక్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పనిచేసిన నాయకులకు గుర్తింపు లేదని.. అబద్ధాలు, తప్పుడు మాటలు చెప్పినవారికే గుర్తింపు ఉందన్నారు. తనకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వకుండా అవమానించారన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని కొందరు ఎమ్మెల్యే సబితారెడ్డికి తనపైన తప్పుడు నివేదికలు ఇచ్చి దూరం పెట్టారన్నారు. తనను బీఆర్ఎస్ నేతలు అడుగడునా అవమానించారని ఆరోపించారు. నేను ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ, ఇన్‌చార్జి ఎంపీపీగా ఎన్నిక కావడానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి కారణమని ఆమెకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఆత్మ గౌరవం చంపుకొని బీఆర్ఎస్ పార్టీలో పనిచేయలేనన్నారు. అందుకే ఎంపీపీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి కుండె వెంకటేశ్‌కి ఓటు వేశామన్నారు. అయితే తాము బీజేపీలో చేరడంలేదని.. త్వరలో తన అనుచరులతో చర్చించి కాంగ్రెస్ పార్టీలో చేరుతానని తెలిపారు. ఆమెతో పాటు ఆమె భర్త కూడా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు.

విద్యార్థులకు అండగా ఉంటాం

స్వచ్ఛ భారత్ రాష్ట్ర కన్వీనర్ రాము



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ రాము, జిల్లా యువ మోర్చా కార్యదర్శి మహేందర్ పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలో కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం కింద 15 మంది విద్యార్థులకు రూ.2500 రూపాయల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. రవీందర్‌రెడ్డి, మహేష్ తదితరులున్నారు.

వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం

భారతి సిమెంట్ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ నితీష్ యాదవ్



బీమా బాండ్లను అందజేస్తున్న ప్రతినిధులు

తుర్కయంజాల్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్.. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను 5 స్టార్ గ్రేడ్‌తో తెలంగాణలో విడుదల చేశామని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ నితీష్ యాదవ్ తెలిపారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని మన్నెగూడలోని సాయి శ్రీ సిమెంట్ మార్కెటింగ్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీలతో నితీష్ యాదవ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తి అవుతుందని, ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి ఇది సరైన ఎంపిక అని అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని.. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే ధర కూడా రూ.20 తక్కువ అని పేర్కొన్నారు. అనంతరం 50 మంది తాపీమేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. సంస్థ డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ బద్రి, డీలర్ శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్యానెల్ ఏర్పాటుతో ఉచిత విద్యుత్

సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద సోలార్‌తో 300 యూనిట్స్ ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరిటెండెంట్ సుబ్రమణ్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద గృహాల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేందుకు అయ్యే ఖర్చులో సుమారు 40 శాతం వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఇందుకోసం పోస్టల్‌శాఖ నిర్వహించే సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

వరండాలో చదువులు

- అసంపూర్తిగా పాఠశాల భవనం
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో ఉర్దూ మీడియం పాఠశాలకు సొంత భవనం లేదు. తరగతులు మాత్రం అక్కడ, ఇక్కడ, చెట్లకింద, పక్కనే ఉన్న మరో పాఠశాల వరండాలో కొనసాగిస్తున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల పక్కపక్కనే ఉన్నాయి. ఉర్దూమీడియం విద్యార్థులు పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంలోని వరండాలో చదువుకుంటున్నారు. దీంతో విద్యార్థులు తరగతిగదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. దీనికి సంబంధించిన పాఠశాల భవనం మాత్రం అసంపూర్తిగా ఉండటంతో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు అసౌకర్యానికి లోనవుతున్నారు.

ప్రారంభం ఇలా..

మండల కేంద్రమైన నందిగామలో 2010లో ఉర్దూ మీడియం పాఠశాల ప్రారంభమైంది. అప్పట్లో ఓ కమ్యూనిటీ హాల్లో విద్యా వాలంటరీలతో తరగతులను కొనసాగించారు. 2012లో అప్పటి ప్రభుత్వం రూ.10 లక్షలతో పాఠశాల భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. ప్రాథమిక పాఠశాల పక్కనే ఉర్దూమీడియం భవనాన్ని నిర్మించేందుకు పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు.

పెరిగిన విద్యార్థుల సంఖ్య..

2015 నుంచి రెగ్యూలర్ టీచర్‌ను ప్రభుత్వం విధుల్లోకి తీసుకుంది. దీంతో విద్యార్థుల సంఖ్య కూడా క్రమేణా పెరిగింది. అయినప్పటికీ ఉర్దూమీడియానికి సొంత భవనం లేకపోవడంతో ఎండా, వాన, చలిగాలులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జూన్ నుంచి ఈ పాఠశాల కేవలం వరండాలో కొనసాగుతోంది. ఈ పాఠశాలలో 1 నుంచి ఐదోతరగతి వరకు 44 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు–మన బడి కింద రూ.29లక్షలు మంజూరు చేసింది. ఈ పథకంతో రెండంతస్తులో భవనం నిర్మించడంతో పాటు కావాల్సిన ఫర్నీచర్‌ను కూడా ఏర్పాటు చేయాలి. కానీ అప్పట్లో వేసిన పిల్లర్ల మీద స్లాబ్ వేసిన కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. భవననిర్మాణానికి కావాల్సిన నిధులు రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే వదిలేశాడు.



ఆగిన ఉర్దూ మీడియం భవనం

త్వరగా పూర్తి చేయించాలి

వరండాల్లో చదువులు కొనసాగించలేం. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆడుకుంటున్న సమయంలో మా తరగతులకు ఇబ్బందిగా మారుతుంది. దీంతో పాటు పాఠశాల సమావేశ మందిరంలో జరిగే కార్యక్రమాల వల్ల కూడా అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు స్పందించి పాఠశాల భవనాన్ని త్వరగా పూర్తి చేయించాలి.

– జాస్మిత, ఐదోతరగతి

వర్షం జల్లు పడుతుంది



సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులతో పాటు, తాము కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. వర్షాకాలంలో వర్షం జల్లు పడడంతో ఇబ్బందిగా మారుతుంది. చదువులకు ఆటంకం ఏర్పడుతుంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాన్ని వీలైనంత తొందర్లో పూర్తి చేయించాలి.

– ఎండి తాహీద్, హెచ్ఎం, ఉర్దూమీడియం

క్లుప్తంగా

విగ్రహ ఏర్పాటుకు విరాళం



విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్ రూ.10,116 లు విరాళం ప్రకటించారు.ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ, చరికొండ గ్రామంలో మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహావిష్కరణ చేపడుతున్నందుకు కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, యాదయ్య, దర్గయ్య, శ్రీను, మహేందర్, శ్రీశైలం,వేణు, శివ తదితరులు పాల్గొన్నారు.

కేవీ రమేశ్‌రాజుకు కమిటెడ్ సెక్రటరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న కేవీ రమేశ్‌రాజు

ఇబ్రహీంపట్నం రూరల్: కేవీ రమేశ్‌రాజు చేసిన సేవలను గుర్తించిన లయన్స్‌క్లబ్ వారు ఆయనకు కమిటెడ్ సెక్రటరీ అవార్డు అందజేశారు. మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సమావేశంలో లయన్స్ ఇంటర్నేషనల్ 320సీ రీజియన్ చైర్‌పర్సన్ లయన్ సాధు శ్యామ్ ప్రసాద్ ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌రాజు మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి అవార్డు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ లయన్ ఇందూరి శ్రీనివాస్, ట్రెజరర్ లయన్ భీంరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్రవంతి సూచించారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద స్మార్ట్ ఈషా ఉమెన్, చిల్డ్రన్ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు, పురపాలక సంఘం సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్, వైద్యులు సంపత్‌గౌడ్, మహేందర్, అనుపమా, మాధురి, శ్రీకార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఫరీద్

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఫరీద్ ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రేమకుమారి, సుశీల, ఎన్ఎస్‌యూఐ నాయకులు మహేశ్, సిద్దు, అబ్దుల్, రాహుల్, పవన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం

హయత్‌నగర్ డివిజన్ డీవీఎం సుచరిత

యాచారం: సాగర్‌రోడ్డుపై యాచారం మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను అన్ని విధాలుగా ఆధునీకరిస్తామని హయత్‌నగర్ డివిజన్ డీవీఎం సుచరిత పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్పతో కలిసి బుధవారం ఆమె యాచారం బస్టాండ్‌ను తనిఖీ చేశారు. బస్టాండ్ ఆవరణలో తిరిగి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. తాగునీటి వసతిపై ఆరా తీశారు. బస్టాండ్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, తాగునీటి, మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం కల్పిస్తామన్నారు. సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి ఆర్టీసీ బస్సును బస్టాండ్‌లోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు.



బస్టాండ్‌లో సౌకర్యాలను తెలుసుకుంటున్న డీవీఎం సుచరిత

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మండల కేంద్రంలో సీఎం చిత్రపటాన్ని పాలతో కడిగారు. ఈ సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు పర్చుతున్నందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన వైద్య సహాయం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీలను అమలు పరిచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, అంజయ్య గుప్తా, భగవాన్‌రెడ్డి, కృష్ణ, రాములు, తిరుపతిరెడ్డి, డేవిడ్, దామోదర్, వెంకటయ్య, మైసయ్య, జంగయ్య, యాదిరెడ్డి, రమేష్, మల్లేష్, వెంకటేష్, శ్రీను, రామ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి

యాచారం సీఐ శంకర్‌కుమార్

యాచారం: రోడ్లపై వాహనాలు జాగ్రత్తగా నడపాలని యాచారం సీఐ శంకర్‌కుమార్ సూచించారు. సాగర్‌రోడ్డుపై బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాదారులు జాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగవన్నారు. సాగర్‌రోడ్డుపై గునుగల్ గేట్ నుంచి మాల్ వరకు వాహనాలు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: పర్యావరణ రక్షణకు, కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో తన జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్‌తో కలిసి సింగిల్‌విండో కార్యాలయంతో పాటు, ప్రధాన కూడలిలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మొక్కలునాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం, జీవీజీ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఇర్షాద్, నాయకులు అంజి, జగదీశ్, ఉపేందర్, సంతోశ్, రాంచంద్రయ్య, కిరణ్, దేవేందర్, వీరేందర్, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వెంకటేశ్‌గుప్తా, దశరథ్‌నాయక్ తదితరులు

మార్చి 1 నుంచి గాలికుంటు వ్యాధికి టీకాలు

కడ్తాల్: మండల పరిధిలోని గ్రామాల్లో మార్చి 1 నుంచి 30 వరకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ చేయనున్నట్లు పశువైద్యాధికారి భానునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పశువైద్య సిబ్బంది రెండు బృందాలుగా గ్రామాల్లో పర్యటించి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ముద్వీన్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులందరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రోడ్ల అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి



పనులను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్‌లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలాభివృద్ధికి కృషి చేయనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామాల సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తొలగిస్తానన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పెద్దూర్ తండాలో సీసీ రోడ్లు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు రఘుతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరైన డబ్బుతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దేవి, నరేశ్, శ్రీను, మత్యాలు, పరీందర్, సురేందర్, ఈశ్వర్, భాస్కర్, రవీందర్, చందూలాల్, శారద, అచామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి



స్వయం పరిపాలనలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

చుక్కాపూర్‌లో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠాలు బోధించి పలువురిని ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా పుష్ప, డీఈవోగా తరుణ్, కలెక్టర్‌గా రాంచరణ్, ముఖ్యమంత్రిగా విజేందర్‌లతో పాటు, 29 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. సాయంత్రం సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం రామనాథం, పాపిరెడ్డి, మణిమాల, కృష్ణయ్య, రజిత, షహనాజ్, బాలకోటి, కవిత, యాదయ్య, శంకర్, మాధవి, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: పట్టణంలోని అరబిందో హైస్కూల్‌లో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా దీక్షిత, జాయింట్ కలెక్టర్‌గా నిహారిక, అదనపు కలెక్టర్‌గా శ్వేత, డీఈఓగా శ్వేత, డిప్యూటీ డీఈఓగా ప్రసన్న, మంత్రులుగా శ్రీజ, హారిక, ప్రిన్సిపాల్‌గా ఆద్య వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అకాడమిక్ అడ్వైజర్ సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



ఆమనగల్లులోని ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



ఆమనగల్లు: పరీక్షా కేంద్రం వద్ద రూం నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

పటిష్ట బందోబస్తు చేసిన పోలీసులు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఇంటర్ పరీక్షల కోసం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. దీనిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రమీలమ్మ జూనియర్ కళాశాల, కడ్తాల మండలంలోని ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాల, బ్రిలియంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తొలిరోజు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 375 మంది విద్యార్థులకు గాను 350 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటయ్య తెలిపారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రం వద్ద ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాడ్గులలో

మాడ్గుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఇంటర్ పరీక్షకు 140 మంది విద్యార్థులకు గాను 135 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తెలిపారు.

7 కేంద్రాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం సజావుగా జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, వాసవి జూనియర్ కళాశాల, విద్యాంజలి, కార్తికేయ జూనియర్ కళాశాలల్లో 3,053 మంది విద్యార్థులకు ఏర్పాట్లు చేయగా 2,967 మంది హాజరయ్యారు. 86 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

నోటు పుస్తకాల అందజేత

మంచాల: మండల పరిధిలోని చిత్తాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ బొడ్డు నాగరాజ్‌గౌడ్ మనవరాలి కన్వీశ్రీ అక్షరాభ్యాసం చేసిన సందర్భంగా బుధవారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు.

బూర నర్సయ్యను కలిసిన నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: బీజేపీ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్టి రాములు కోరారు. ఎంపీ అభ్యర్థిగా బూర నర్సయ్యగౌడ్‌ను ప్రకటించడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు గణేష్, సత్యనారాయణ, మహేశ్ పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్యకే ప్రాధాన్యం

మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రయోగాత్మక విద్యకే ప్రాధాన్యం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి సూచించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ నలంద గ్రామర్ స్కూల్‌లో సైన్స్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. వైజ్ఞానిక నైపుణ్యాలను అలవాటు చేసుకోవాలన్నారు. బట్టీ చదువుల కంటే ప్రయోగాత్మక విద్యకే మక్కువ చూపాలన్నారు. విద్యార్థుల భవితకు ఓ ప్రేరణ కలిగించే విధంగా చదువులు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్ మౌనిక ఉదయ్‌పాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత

కడ్తాల్: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని ముద్వీన్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిoంచిన ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు నిర్మల మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఎక్వాయిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌లు వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, వాణి, పీఈటీ భీముడు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: వైజ్ఞానిక ప్రదర్శనలు చూస్తున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి

నేషనల్ సైన్స్ డే వేడుకలు

తుర్కయంజాల్: సైన్స్ అండ్ టెక్నాలజీపై ఆసక్తి పెంపొందించడం జాతీయ సైన్స్ దినోత్సవ ప్రధాన ఉద్దేశమని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి భాయి అన్నారు. బుధవారం కొహెడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రయోగశాలలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు జగన్‌రాజ్, లక్ష్మణ్, గోపాల్ రెడ్డి, నరసింహ, రాధా మాధవి, కొండయ్య, మంజుల, కృష్ణకుమార్‌లతో కలిసి విద్యార్థుల ప్రయోగాలను వీక్షించారు.



కడ్తాల్: సీవీ రామన్ చిత్రపటం వద్ద హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు

‘నూకం’కు యువజన బాధ్యతలు

మంచాల: కాంగ్రెస్ యువజన మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఆరుట్ల గ్రామానికి చెందిన నూకం రాయుడిని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం క్రమశిక్షణతో కష్టపడి పని చేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ పిలుపు మేరకు గ్రామాలలో యువతను చైతన్య పర్చి పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం రాయుడు మాట్లాడుతూ.. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా స్థాయి కాంగ్రెస్ యువజన నాయకులకు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రం తీసుకుంటున్న నూకం రాయుడు